క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాకాజీ కాలనీ, హనుమకొండ చౌరస్తా, జిల్లా బస్‌స్టేషన్, అలంకార్ జంక్షన్, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, వడ్డెపల్లి పోస్టాఫీస్ ప్రాంతం, విజయ్‌పాల్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమం



న్యూశాయంపేట: విద్యుత్ అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కే.భిక్షపతి సూచించారు. విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు టి.వెంకట్రాములు, శ్రీనివాస్, టి.భిక్షపతి, రవి, ఎల్లేశ్, సారంగపాణి, రాజమౌళి, సదానందం, వెంకటేశ్, అనిల్, కుమారస్వామి, లావణ్య, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఫిర్యాదుకు స్పందన



హన్మకొండ: హనుమకొండ విద్యానగర్‌లో సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాలకు వెళ్లే రోడ్డు మలుపు ప్రమాదకరంగా తయారైంది. భారీ వరదకు రోడ్డు కోతకు గురైంది. దీంతో రోడ్డు ఇరుకుగా తయారైంది. ఒక ఆటో కూడా నాలాలో పడిపోయింది. ఈ క్రమంలో హనుమకొండ విద్యానగర్‌కు చెందిన పలివెల వివేకానంద ఈనెల 10, 16వ తేదీల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్లు ఈనెల 20న పరిశీలించి త్వరలో కంచె ఏర్పాటు చేస్తామని చెప్పి రెండు రోజుల క్రితం పని మొదలుపెట్టారు.

కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


కిరణ్‌గౌడ్, అధ్యక్షుడు


నాగేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని హ్యూమానిటీస్ భవనంలో బుధవారం నిర్వహించిన పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోల్తి కిరణ్‌గౌడ్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ సుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ విజయ్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ కేవీఎస్ నరేందర్, అడ్వైజర్లుగా డాక్టర్ సుమంత్, డాక్టర్ మోహన్, కోఆర్డినేటర్‌గా రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాబాసాహెబ్ ఆప్టే స్మారక దివస్



హన్మకొండ కల్చరల్: వరంగల్ చాప్టర్ ఇతిహాస సంకలనం సమితి (భారతీయ) ఆధ్వర్యంలో హనుమకొండలోని రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో ప్రముఖ చరిత్రకారుడు బాబా సాహెబ్ ఆప్టే సమర్పన్ దివస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ విజయబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వేదుల నరసింహ, ప్రొఫెసర్ చిలుకమారి సంజీవ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి బుచ్చిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గజ్జెల సుమన్‌కు మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారం



వరంగల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు గజ్జెల సుమన్‌కు మదర్ థెరిస్సా జాతీయ సేవా పురస్కారాన్ని మదర్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ మల్లాది ప్రసాదరావు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ దాసు, మనం ఫౌండేషన్ ఫౌండర్ చక్రవర్తి, హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అందజేశారు. విజయవాడ హనుమంతరాయ పౌర గ్రంథాలయంలో మదర్ సర్వీస్ సొసైటీ రెండవ వార్షికోత్సవాలు మంగళవారం రాత్రి జరిగాయి. అవార్డు పొందిన సుమన్‌ను పలువురు అభినందించారు.

మార్కెట్ పీఠం ఎవరికో?

వరంగల్ మార్కెట్ కమిటీ లేక ఏడాది

- అధికార మార్పుతో పెరిగిన ఆశావహులు
- నేతల మధ్య సఖ్యత లేక ఆలస్యం
- మారని రిజర్వేషన్.. 'ఎస్సీ మహిళ'కే అవకాశం
- రంగంలోకి దిగిన నిఘా వర్గాలు?



వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పీఠం ఎవరికి దక్కుతుందోనన్న చర్చ జోరుగా సాగుతోంది. పాత మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీ కాలం 2023 జూలైలో ముగిసింది. అప్పటి ప్రభుత్వం ఐదు పర్యాయాలు కొనసాగేలా రిజర్వేషన్ నిర్ణయించింది. ఆ రిజర్వేషన్ ప్రకారం.. చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యింది. ఈఅంశంపై అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల మధ్య అవగాహన లేకపోవడంతో కమిటీ ఏర్పాటు జాప్యమైంది. అంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కొత్త చైర్మన్ నియామకం కాలేదు.

మారిన సీన్..

తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఎన్నికల్లో ఓడిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీన్ మారింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టికెట్లు ఆశించి భంగ పడిన వారు, ఎమ్మెల్యే గెలుపు కోసం కష్టపడిన నాయకులు చైర్మన్ పదవికి పోటీ పడ్డారు. దీంతో రాష్ట్ర నాయకత్వం మార్కెట్ కమిటీల ఏర్పాటు అంశాన్ని పక్కనపెట్టినట్లు తెలిసింది. ప్రస్తుతం ఎంపీ ఎన్నికలు కూడా ముగియడం, స్థానిక సంస్థల కాలపరిమితి ముగియడంతో ఎక్కువ మంది వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవులకు పోటీ పడుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అతి ముఖ్యమైన ఏనుమాముల మార్కెట్ కమిటీ పీఠం దక్కించుకోవాలని నాయకులు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల అండదండలతో టీపీసీసీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈమార్కెట్ పరిధి ఎమ్మెల్యేలు మొత్తం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడంతో చైర్మన్ ఎంపిక క్లిష్టంగా మారిందని తెలుస్తోంది.

ఆశావహుల ప్రయత్నాలు

వర్ధన్నపేట ఎమ్మెల్యే, వరంగల్ ఎంపీ స్థానాల్లో టికెట్ ఆశించిన వర్ధన్నపేట, తూర్పునకు చెందిన సీనియర్ నాయకులు తమకు (భార్యలకు) వరంగల్ మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలని రాష్ట్ర నాయకుల వద్ద పట్టుపడుతున్నారు. వీరితో పాటు దశాబ్దాలుగా కొండా దంపతులకు సన్నిహితుడిగా పేరున్న చిలువేరు శ్రీనివాస్ తనకు అవకాశం కల్పించాలని వారిని ప్రాధేయపడుతున్నట్లు తెలిసింది. పోలీసు శాఖ నుంచి టీడీపీలో చేరి కాంగ్రెస్‌కి వచ్చిన నాయకుడు ఎంపీ, ఎమ్మెల్యేగా అవకాశం దక్కకపోవడంతో మార్కెట్ కమిటీలో అవకాశం ఇవ్వాలని ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. వరంగల్ పశ్చిమకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, డాక్టర్‌తో పాటు ఒక విద్యాసంస్థ అధినేత, తూర్పుకు చెందిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ సైతం పోటీ పడుతున్నట్లు తెలిసింది. వీరే కాకుండా మరి కొంత మంది తమ ఎమ్మెల్యేతో ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. పరకాల, పశ్చిమకు చెందిన నాయకులు ఇప్పటికే రాష్ట్ర కార్పొరేషన్ పదవులు లభించడంతో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే మంత్రి తన వర్గానికి చైర్మన్ పదవి కావాలంటూ పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే పరిధిలోనే మార్కెట్ ఉన్నందున తన వర్గానికి కేటాయించాలని కోరుతున్నట్లు తెలిసింది. ఈమేరకు ఇప్పటికే నిఘా వర్గాలు పదవులను ఆశిస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

ఎస్సీ మహిళకే పీఠం...



ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్ ప్రకారం.. వరంగల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎస్సీ మహిళకు అవకాశం దక్కనుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులకు రిజర్వేషన్ ఐదుసార్లు అమలు చేసేలా డ్రాతీశారు. పాత రిజర్వేషన్ ప్రకారం.. వరంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మొదట, రెండోసారి బీసీలకు, మూడో సారి ఓసీ, నాలుగోసారి ఎస్సీ(మహిళ), ఐదోసారి ఓసీ మహిళకు రిజర్వు చేశారు. మొదటి రెండు సార్లు కొంపెల్లి ధర్మరాజు, ఉద్యమకారుల కోటాలో చింతం సదానందం, ఓసీ కోటాలో చాంబర్ మాజీ అధ్యక్షుడు దిడ్డి భాగ్యలక్ష్మీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. నాలుగో పర్యాయం ఎస్సీ కేటగిరితో పాటు మహిళ రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉండడంతో చైర్మన్ పదవి పెండింగ్‌లో పడింది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అధిష్టానం.. పాలకవర్గ ఏర్పాటుపై మల్లగుల్లాలు పడుతుతోంది.

కులగణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్వామి

నయీంనగర్: దళితుల కులగణన చేసిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలని, ఎస్సీ ఉపకులాలను మాల, మాదిగ కులాలతో కలపొద్దని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీఎస్.స్వామి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేస్తానని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విధివిధానాలను రూపొందించుటకు రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల్లో అత్యంత వెనుకబడిన ఉపకులాలను 'ఏ' వర్గంలో చేర్చి 5శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. ఎస్సీ ఉపకులాలకు వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఉపకులాలకు అన్యాయం జరిగితే మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో భిక్షపతి, ప్రణయ్, రంజిత్, నరేష్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి



కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కళాశాల ఆవరణలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జోనల్ ఇన్‌చార్జ్ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తైన విద్యార్థులకు ఫీజుల పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వటంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.

టెక్నికల్ ఉద్యోగుల సమస్యలపై పోరాడాలి


ప్రసాద్‌ను సన్మానిస్తున్న సంఘం బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న టెక్నికల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడాలని కేయూ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ సూచించారు. కాకతీయ యూనివర్సిటీలోని టెక్నికల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టెక్నికల్ ఉద్యోగుల ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించేందుకు మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందబోతున్న ఉద్యోగి దామెర ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు మెట్టు రవి, బొక్క మొగిలి, దామెర ప్రకాశ్, మంద శ్యామ్, రణధీర్, ప్రేమ్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

విద్యారణ్యపురి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దోమల ద్వారా డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందాయని అన్నారు. కార్యక్రమంలో జువాలజీ విభాగం అధిపతి డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు డాక్టర్ లకన్‌సింగ్, డాక్టర్ మహేష్, డాక్టర్ సుభాషిణి, సైన్స్ విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఖిలా వరంగల్: తూర్పుకోట హనుమాన్ జంక్షన్‌లో సీజన్ వ్యాధుల నివారణపై స్పందన జనపద కళారంజని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ హాజరై కళాకారుల ప్రదర్శనలు ప్రారంభించారు. కార్యక్రమంలో బోగి సురేష్, సంగరబోయిన చందర్, బంగారు శ్రీనివాస్, అల్లం కేశవ్, సారంగపాణి, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌పై దుష్ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

హన్మకొండ: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నిధుల దుర్వినియోగంపై నిరాధారమైన ఆరోపణలతో రోహిణి ఆస్పత్రిపై దుష్ప్రచారం చేస్తున్నారని రోహిణి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బుచ్చిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ రెడ్డి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 మేలో తమ ఆస్పత్రిని సీఐడీ అధికారులు సందర్శించి సీఎంఆర్‌ఎఫ్‌లో చూపిన ఆధారాలపై విచారణ చేసినట్లు తెలిపారు. ఆరోపణల్లో పేర్కొన్న బిల్లులు రోహిణి ఆస్పత్రికి సంబంధించినవి కావని వారు నిర్ధారించారని గుర్తుచేశారు. తమ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఓ రోగి ఐపీ నంబర్‌తో ఇతర వ్యక్తి పేరు చేర్చి తప్పుడు పత్రాలు సృష్టించారని అన్నారు. రోహిణి ఆస్పత్రిపై వస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని కోరారు.

సంక్షిప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్‌లో 12మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ బుధవారం పంపిణీ చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశం మేరకు ఇంటింటికి వెళ్లి చెక్కులను అందించారు. కార్యక్రమంలో నాయకులు భరత్, నాగవెల్లి శ్రీధర్, ఇమ్రాన్, కొండ శివ, రాకేష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదామాధవ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు



హన్మకొండ కల్చరల్: హనుమకొండ వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో ఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి ఆధ్వర్యంలో ఆపదుద్ధారక స్వామికి ఉదయం అభిషేకం, అలంకరణ పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీకృష్ణుడికి విశేష అభిషేకం అలంకరణ, దశమస్కంద పారాయణం, విష్ణుపురాణ పారాయణం చేశారు. అనంతరం చిన్నికృష్ణుడికి ఊంజల సేవ నిర్వహించారు.

పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం

ఖిలా వరంగల్: పేద విద్యార్థుల అభివృద్ధే ధ్యేయమని లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆత్మీయ ప్రేమలత ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు శారదాబాయి అధ్యక్షతన విద్యపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మార్చే శక్తి ఒక విద్యకే ఉందని గుర్తుచేశారు. ఈక్రమంలో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి, శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ మాజీ చైర్మన్ మండల పరశురాములు, రాజేశ్వరి, ప్రభాకర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ జిష్ణుదేవ్‌కు ఘన స్వాగతం





గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీ అంబర్ కిషోర్‌ఝా

కాజీపేట అర్బన్: నగర పర్యటనలో భాగంగా నిట్ వరంగల్‌లోని కలాం గెస్ట్ హౌస్‌కు బుధవారం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రెవెన్యూ, హౌసింగ్, సమాచారా పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. తొలుత పోలీసులు గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, సీపీ అంబర్ కిషోర్‌ఝా, కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన సీపీ అంబర్ కిషోర్‌ఝా

వరంగల్ క్రైం: హనుమకొండ, వరంగల్ జిల్లాల పర్యటనలో భాగంగా నిట్ కళాశాలలోని అతిథి భవనానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

గవర్నర్‌ను కలిసిన టీఎన్జీఓస్ నాయకులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలెక్టరేట్ కార్యాలయంలో టీఎన్జీవోస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి రాజేష్, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్, కేంద్రసంఘ కార్యవర్గ సభ్యులు లక్ష్మీప్రసాద్, సారంగపాణి పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండకు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిదురాల సుధాకర్, పిన్నింటి బాలాజీరావు, హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని వీరస్వామి, సంగెం శ్రీనివాస్, బత్తిని వెంకటరమణ, ఉప్పుల సతీష్, రిటైర్డ్ ఎంప్లాయీస్ బీజేపీ సెల్ కోచైర్మన్ పులి సరోత్తమరెడ్డి , భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుపతి, వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ, విఘ్నేశ్వరుడి విగ్రహాల ప్రతిష్ఠాపన


ప్రతిష్ఠాపనోత్సవంలో వేద పండితులు, భక్తులు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెట్రోల్ బంక్ జంక్షన్‌లో శివశక్తి వినాయక మందిరంలో గణపతి, శివలింగం, నందీశ్వర సహిత పార్వతీదేవి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు బైరబోయిన దామోదర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చెన్నూరి దేవేందర్, కోశాధికారులు మంతిని చక్రధారి, బండి నాగరాజు, గండ్రాతి నవీన్, సలహాదారులు, ఉపాధ్యక్షులు అచ్చ వినోద్ కుమార్, సిద్దం రాము, సారంగపాణి, గజ్జెల శ్యామ్ ఆధ్వర్యంలో వేదపండితుడు పోలోజు భాస్కచార్యుల బృందంతో కలిసి సిద్దయోగి స్వామి చైతన్యానంద స్వామిజీ నేతృత్వంలో ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలిరాగా.. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, బీజేపీ నేత కుసుమ సతీష్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమ, పోశాల పద్మ, కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా 15 లక్షల మంది అంధులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

హసన్‌పర్తి: దేశవ్యాప్తంగా 15లక్షల మంది అంధులున్నారని, అందులో 60శాతం మంది బాలబాలికలున్నారని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ వివరించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా హసన్‌పర్తిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో నేత్ర, అవయవ, శరీర దానంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర దానం అంటే మొత్తం కన్నుగుడ్డు తీయడం కాదని, కంటిలోని పల్చని 'కార్నియా' మాత్రమేనని చెప్పారు. మరణించిన వ్యక్తి నేత్రాలను ఇంటి వద్దే నిపుణులు సేకరిస్తారని తెలిపారు. మరణాంతరం ఉపయోగపడే నేత్రం, అవయవాలు, శరీరం మట్టిలో వృథా కాకుండా దానం చేసి మానవ మనుగడకు తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమలో సామాజికవేత్త పరికిపండ్ల వేణు, జనవిజ్ఞాన వేదిక హనుమకొండ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కస్తూర్బాగాంధీ విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఉపాధ్యాయులు హెలెన్, రజిత, జ్యోతి, మమత, శ్రీలత, రాజేశ్వరి, మౌనిక టి.మమత తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో పోచమ్మతల్లి ఉత్సవాలు



కాజీపేట: కాజీపేట పట్టణంలో బుధవారం పోచమ్మతల్లి బోనాలను నిర్వహించారు. బోనాలతో అమ్మవారి ఆలయాలకు చేరుకుని నైవేద్యాలను సమర్పించారు. బాపూజీనగర్, శాంతినగర్ కాలనీ, సోమిడి, విద్యానగర్‌కాలనీ, సిద్ధార్థనగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో కనులపండువగా బోనాల వేడుకలను జరుపుకున్నారు. ఈ ఉత్సవాల్లో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, ఎలకంటి రాములు, సంకు నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: బడ్జెట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వరంగల్ డివిజన్ వడుప్సా, ట్రస్మా ప్రతినిధులు కోరారు. ఈమేరకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలో కలిసి విన్నవించారు. వరంగల్ డివిజన్ వడుప్సా అధ్యక్షుడు బొల్లం కనకయ్య, ట్రస్మా రాష్ట్ర అడ్వైజర్ కొమ్మినేని భూపాల్‌రావు, వడుప్సా వరంగల్ డివిజన్ చీఫ్ అడ్వైజర్ సామల సుధాకర్, అడ్వైజర్ యాద విద్యాసాగర్, డివిజన్ కార్యదర్శి జన్ను విలియమ్స్, కోశాధికారి సుధీర్, బాధ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, సామల శశిధర్‌రెడ్డి, సామల మురళి, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

ఖిలా వరంగల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూనే హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని తెలంగాణ, ఉత్తరాఖండ్, ఉజ్జాయిని సిద్ధయోగి పీఠాధిపతి చైతన్య ఆనంద స్వామిజీ సూచించారు. వరంగల్ పర్యటనలో భాగంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డులో పెట్రోల్ బంక్ జంక్షన్‌లో బుధవారం జరిగిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు స్వామిజీ హాజరై భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలకు తల్లిదండ్రులు, గురువులు జ్ఞానం, సంస్కృతి, ఆచారాన్ని అందిస్తే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దామోదర్ యాదవ్, చెన్నూరు దేవేందర్, సిద్దం రాము, చక్రధారి, బాసాని శ్రీనివాస్, నాగరాజు, నవీన్, గౌరై చేరాలు, అచ్చ వినోద్‌కుమార్, వడ్డెపల్లి భరత్, నల్లకుంట రవికుమార్, సారంగపాణి, భక్తులు పాల్గొన్నారు.

షాపులోకి దూసుకెళ్లిన లారీ



ఖిలా వరంగల్: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా లారీ అదుపు తప్పి ఓ బేకరీ షాపులోకి దూసుకెళ్లింది. దాంతో భవనం ముందుభాగం స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున 3గంటలకు జాతీయ రహదారిపై వరంగల్ రంగశాయిపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మంచిర్యాలకు చెందిన లారీ డ్రైవర్ నవీన్.. విజయవాడ నుంచి ఆయిల్ లోడ్‌తో వరంగల్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో రంగశాయిపేట తెలంగాణ కాలనీ వద్దకు చేరుకోగానే డ్రైవర్ ఒక్కసారిగా నిద్రమత్తులోకి జారడంతో లారీ అదుపు తప్పి బేకరీ షాపులోకి దూసుకెళ్లింది. మిల్స్‌కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

రెండు పాడి గేదెలు చోరీ

మడికొండ: మడికొండ పోలీసుస్టేషన్ పరిధి శివారులోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో కాజీపేట రహమత్‌నగర్‌కు చెందిన మహ్మద్ షఫీకి చెందిన కాకతీయ డైరీ ఫామ్‌లో మంగళవారం రాత్రి రెండు పాడి గేదెలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. వారం రోజుల క్రితం మడికొండ శివారులోని కపిల్ హోమ్స్‌లో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురింది. వరుస దొంగతనాలతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. బాధితుడు షఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజబాబు తెలిపారు.

పోచమ్మ గుడి నిర్వహణపై ఫిర్యాదు

కాశిబుగ్గ: కాశిబుగ్గ 19వ డివిజన్‌లోని పోచమ్మగుడిలో తరతరాలుగా తమ పూర్వీకుల నుంచి పూజలు చేస్తున్న తమను రెండేళ్లుగా కొంతమంది స్థానికులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుడి వంశ పరంపర కుమ్మరి పూజారుల కమిటీ అధ్యక్షులు ఓరుగంటి కొమురయ్య, రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. స్థానికులమంటూ చింత కృష్ణ, నీలం శ్రీను, కె.సత్యనారాయణ, తదితరులు గుడిపై దౌర్జన్యం చేస్తూ తమను చిత్రహింసలకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు.